క్లుప్తంగా

19న కృపాలక్ష్మి నామినేషన్

వెదురుకుప్పం: గంగాధరనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి ఈనెల 19న శుక్రవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేసున్నారు. ఈ మేరకు నామినేషన్‌కు సంబంధించిన పత్రాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

అందరికీ ఉపాధి కల్పించాలి


పనులను పరిశీలిస్తున్న రాజశేఖర్

వెదురుకుప్పం: గ్రామీణ ఉపాధి హామీ కింద ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మయ్యపల్లె, తిరుమలయ్యపల్లె పంచాయతీలలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, స్ట్రక్చర్, సప్లై చానెల్ పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు, సక్రమంగా వేతనాలు చెల్లిస్తున్నారా ? లేదా ? తదితర అంశాలకు సంబంధించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి అందరికీ పనులు కల్పించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కుటుంబాలకు చెందిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులు కల్పించడంతో క్షేత్ర సహాయకులు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పించే దశలో వెనుకబడిన క్షేత్ర సహాయకులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సూచనలు సలహాలు ఇచ్చారు. ఆయన వెంట క్లస్టర్ సహాయక పథక సంచాలకులు శోభన్‌బాబు, ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఓ ఇందు, ఈసీ మునిరత్నం, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణకు గట్టి బందోబస్తు


పోలీసులతో సమీక్షిస్తున్న ఆర్‌ఓ వెంకట శివ

గంగాధర నెల్లూరు: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరణకు గట్టి పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం శాంతిభద్రలపై పోలీస్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18న నుంచి నామినేషన్లకు, మే 13న జరగనున్న శాసనసభ ఎన్నికల నిర్వహణకు అవసరమైన బందోబస్తు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. నామినేషన్ల సమయంలో ఆర్‌ఓ కార్యాలయం దగ్గర బారీకేడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, డీఎస్పీ ఇలియాస్ బాషా, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నగరి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది అక్షర పబ్లిక్ స్కూల్‌లోని విద్యార్థులకు అగ్నిమాపక పరికరాల పనితీరు, వాటిని వినియోగించాల్సిన పద్ధతులపై మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అగ్నిమాపక విన్యాసాలు ప్రదర్శించడంతో పాటు కరపత్రాలు పంచారు. ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయాల్లో వాటిని ఆర్పడానికి వినియోగించే పరికరాల గురించి విద్యార్థులకు ఫైర్ ఆఫీసర్ డి.సుబ్బరాజు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఏకాంబరకుప్పంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నగరి: మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ఎన్నికల అధికారి అయిన ఆర్డీఓ వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. కేంద్రాల వద్ద చేపట్టిన ఏర్పాట్లపై మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల వద్ద ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శేఖర్, టీపీఓ నీరజాక్షి, ఏఈలు రమేష్, వీరభద్ర, మున్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపు చారిత్రక అవసరం

- ఐదేళ్ల పాలనలో సీఎం జగనన్న అద్భుతాలు చేశారు
- మరోమారు సీఎంను చేసుకుందాం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా


పుత్తూరు మున్సిపాలిటీలోని 2వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు: సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపు చారిత్రక అవసరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు అభివృద్ధి కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని బలపరచాలని అభ్యర్థించారు. మంగళవారం మున్సిపాలిటీ 2వ వార్డు ఒంటిమిట్ట, ఎస్టీ కాలనీ, కేఎం అగ్రహారం, మహాలక్ష్మీపురం, తిమ్మాపురం గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న తన ఐదేళ్ల పాలనలోనే అద్భుతాలు చేశారని చెప్పారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలని, అందుకు నేను సిద్ధం మీరు సిద్ధమా అన్ని ప్రశ్నించారు. పలువురు మహిళలు మేమూ సిద్ధం అంటూ ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మ్యానిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 99 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని తెలిపారు.

గ్రామస్వరాజ్యం కల సాకారం..

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి ఇంటా సంక్షేమం అందిస్తూ మహాత్మ గాంధీజీ కన్న కలలను సాకారం చేస్తున్న ఘనత మన సీఎం జగనన్నకే దక్కిందన్నారు. ప్రతి సంక్షేమ పథకం కూడా మహిళల పేరిట అందించి ఆర్థిక సాధికారతకు కృషి చేస్తున్న గొప్ప నేత సీఎం జగనన్న ఆమె కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్ కోసం ఇంత మంచి చేస్తున్న జగనన్నను మరో మారు అందరూ సీఎంను చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నగరి నుంచి తనను ముచ్చటగా మూడవసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, పార్టీ నాయకులు గాంధీ, రమణరాజు, లారీమోహన్, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశన్‌రెడ్డి, ప్రసాద్, ఏకాంబరం, గూళూరు కరుణ, జయచంద్రన్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.


అవ్వా నీ ఆశీర్వాదం కావాలంటున్న మంత్రి రోజా

కూటమిని భూస్థాపితం చేయండి

శ్రీరంగరాజపురం: మోసపూరిత హామీలతో వస్తున్న టీడీపీ, జనసేన కూటమిని భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండల కన్వీనర్ మణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా పారదర్శక పాలన అందిస్తున్న ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. ఎవరైనా దళితులుగా పుడతారా అన్న చంద్రబాబుకు నేడు దళితుల ఓట్లను అడిగే హక్కు ఎక్కడిది అని ప్రశ్నించారు. 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న చంద్రబాబు ఎప్పుడైనా అంబేద్కర్ విగ్రహం పెట్టారా ? అని ప్రశ్నించారు. దళితులకు ద్రోహం చేసిన పార్టీ టీడీపీ అన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహకారంతో నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.250 కోట్లతో రహదారుల అభివృద్ధి, 23 ఆలయాలను దేవదాయ శాఖ ద్వారా ఒక్కో ఆలయానికి రూ.1 కోటి నుంచి రూ.5 కోట్ల మేర కేటాయించి అభివృద్ధి చేశారన్నారు. అభివృద్ధి ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని ఎమ్మెల్యేగా కృపాలక్ష్మిని, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాలప్ప, నాయకులు జనార్దన్, అమృతరాజ్, హరిరెడ్డి, ఆనందయ్య, జయపాల్, రామకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆశీర్వదించండి .. మీకు మంచి చేస్తా

- గంగాధరనెల్లూరుకు వన్నె తెస్తా
- సీఎం జగనన్న చెల్లెలుగా మీ ముందుకు వచ్చా
- ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి


జీటీకండ్రిగలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

వెదురుకుప్పం: ''ఇంతకాలం ఏమీ ఆశించకుండా ఇంతలా మా కుటుంబాన్ని ఆదరిస్తున్న మీకు జన్మజన్మలా రుణపడి ఉంటాం.. ఈసారి కూడా మీఇంటి బిడ్డగా నన్ను భావించి ఆశీర్వదించండి.. జీడీ నెల్లూరు నియోజకవర్గానికే వన్నె తెస్తా'' అని ఎమ్మెల్యే అభ్యర్థి కే. కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని జీటీ కండ్రిగ వద్ద ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రభుత్వంలో కుల, మత, వర్గ వైషమ్యాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో చేసిన అభివృద్ధి పనులు గతంలో ఎవరి హయాంలో కూడా జరగలేదన్నారు. సీఎంగా జగనన్న ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచీ వేసిన ప్రతి అడుగూ పేదల కోసమేనని స్పష్టం చేశారు. నవరత్నాల రూపశిల్పి, నాడు–నేడు ద్వారా సర్కారు స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. సామాజిక, రాజకీయ రంగాల్లో పేదలు, బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించి పేదల పాలిట దైవమైన సీఎం జగనన్నను మరోసారి సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు.


పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

జరిగే చెడును ప్రజలకు వివరించండి..

జగనన్న ద్వారా పేదలకు జరిగే మేలు..చంద్రబాబు ద్వారా జరిగే మోసాలను ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త ప్రజలకు వివరించాలని కృపాలక్ష్మి అన్నారు. ప్రగతికి పట్టం కట్టి పేదల జీవితాల్లో మరింత వెలుగులు నిండాలంటే రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఆనందరెడ్డి, ఎంపీపీ నాగరాణి, జెడ్పీటీసీ సుకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి, బీసీ సెల్‌రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ నారాయణ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బండి గోవర్దన్‌రెడ్డి, మాధవ, ఎంపీటీసీలు రాధిక, భాస్కర్, మునిచంద్రారెడ్డి, గుణశేఖర్, సర్పంచ్‌లు గోవిందయ్య, అన్నురాశి, రాజశేఖర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు పేట ధనంజయరెడ్డి, మాజీ ఎంపీపీలు అరుణ, పురుషోత్తం, జ్ఞానమ్మ, మాజీ సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, చిరంజీవిరెడ్డి, హేమశేఖర్‌రెడ్డి, యువత మండల అధ్యక్షుడు గణపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్‌రెడ్డి, నాయకులు భీమశంఖర్ రెడ్డి, శివాజీ, ప్రకాష్, సురేష్‌రెడ్డి, పురంధర్‌రెడ్డి, బొజ్జారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరాములు రెడ్డి మృతి


శ్రీరాములు రెడ్డి (ఫైల్)

గంగాధరనెల్లూరు: మండలంలోని నందనూరు గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నందనూరు శ్రీరాములు రెడ్డి (92) సోమవారం రాత్రి అనారోగ్యం కారణంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న డెప్యూటీ సీఎం నారాయణస్వామి మంగళవారం నందనూరు గ్రామానికి చేరుకుని శ్రీరాములు రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన నారాయణస్వామి మాట్లాడుతూ శ్రీరాములు రెడ్డి గొప్ప నాయకుడని, చిత్తూరు జిల్లా చక్కెర సహకార కర్మాగారంలో ఇంజినీర్‌గా విధులు నిర్వహించారని తెలిపారు. జిల్లా రైతు సంఘం నాయకుడిగా, పారిశ్రామికవేత్తగా ఎదిగిన ఓ గొప్ప వ్యక్తి అని, విద్యపై మక్కువతో చాలామందికి సహాయ సహకారాలు అందించేవారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, నందనూరు సురేష్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు వెంకటారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ చిన్నమ రెడ్డి, రూపకుమార్ రెడ్డి, గోవింద రెడ్డి, శ్రీరంగరాజపురం మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాములు రెడ్డి మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్ కీలకం


ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ స్వరూప

కార్వేటినగరం: ప్రతి విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియెట్ ప్రధానమైనదని ఆర్కేఎస్సార్ పభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి.స్వరూప అన్నారు. కళాశాలలో మంగళవారం ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇంటర్‌లో ఉత్తీర్ణత స్థాపించిన వారు ఉన్నత చదువులకు అర్హులై ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు, విద్య పట్ల పట్టుదల ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పి.అఖిఫా, పి.లిఖిత, మొదటి సంవత్సరంలో టాపర్లుగా నిలిచిన ఆర్.పీ.నరసింహరాజు, ఆర్.వైష్ణవి, జి.శృతిని ప్రిన్సిపల్ అభినందిస్తూ బహుమతులను అందించారు. ఇందుకు కృషి చేసిన అదేవిధంగా అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వందశాతం ఫలితాలు సాధించిన హిందీ అధ్యాపకులు సీ.విజయ, రమేష్, షార్ట్‌హ్యాండ్ అధ్యాపకులు డాక్టర్ యాదవతికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. 24 నుంచి జరగబోయే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ఆయా పాఠ్యాంశాలపై తర్ఫీదు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ రాజేష్, రమణకుమారి పలువురు పాల్గొన్నారు.

నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించండి


మాట్లాడుతున్న సర్పంచ్ ధనుంజయవర్మ

కార్వేటినగరం: గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఈఓపీఆర్‌డీ మణి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మతులకు గురైన మోటార్లు, పైపులైన్ల గుర్తించి వెంటనే బాగు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీకి మంజూరైన 15వ వార్షిక ప్రణాళిక నిధులతో నూతన పనులు ప్రారంభించకుండా అత్యవసరమైన తాగునీటి పనులు, మోటార్ మరమ్మతులు, పైపులైన్ రిపేర్లు, తాగు నీటి ట్యాంకుల మరమ్మతులు వంటి వాటికి వెచ్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం వైద్యసిబ్బంది అంబరీష్ రాజు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా ఎండలు మండుతుండడంతో 11 గంటలపైన ఎవరూ బయటకు వెళ్లకూడదని, వడదెబ్బకు లోనైతే వెంటనే ఓఆర్ఎస్ లేదా ఒక లీటరు నీటిలో చిటికెడు ఉప్పు వేసి సేవించడం మంచిదన్నారు. వృద్ధులు, చిన్నపిల్లలను తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు తీసుకెళ్లేటప్పుడు తప్పకుండా గొడుగుతో పాటు తాగునీళ్లు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు టీ.రాజేష్, కే.విజయశ్రీ, వార్డు మెంబర్లు మురళి, రత్నంరెడ్డి, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఏట్టుకూరిపల్లె గ్రామంలో వెలసిన ఎల్లమ్మతల్లికి మంగళవారం గ్రామస్తులు వివిధ అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని ఆలయ అర్చకులు పాలు, పెరుగు, చందనం, తేనె, నెయ్యితో వివిధ అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం ఆలయ నిర్వాహకులు అమ్మవారికి పూజకు కావలసిన పూజసామగ్రి, సుగంధ పుష్పాలు, పండ్లను గ్రామాల్లో ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తులకు పంచామృతం, తీర్థప్రసాదం పంచి పెట్టారు.

కోడ్ ఉల్లంఘనకు పాల్పడవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరెడ్డి

- నామినేషన్ల సమయంలో జాగ్రత్తగా వ్యవహరించండి
- ఎన్నికల అధికారి వెంకటరెడ్డి

నగరి: నామినేషన్ల సమయంలో కోడ్ ఉల్లంఘనకు పాల్పడరాదని ఎన్నికల అధికారి, ఆర్డీఓ వెంకటరెడ్డి, డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అన్ని పార్టీల నేతలతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నామినేషన్లు వేసే అభ్యర్థులు తేదీని ముందస్తుగా ప్రకటించి, వాటికి సంబంధించిన అనుమతులు తీసుకోవాలన్నారు. నామినేషన్ ర్యాలీలో టపాకాయలు పేల్చడం నిషేధమన్నారు. మైక్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని డీజేలు వాడరాదన్నారు. ప్రతి అంశాన్ని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ టీం పరిశీలిస్తూ ఉంటుందన్నారు. భద్రతా వసతుల రీత్యా స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని నామినేషన్ స్వీకరణ కేంద్రంగా నిర్ధారించడం జరిగిందన్నారు. నామినేషన్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ర్యాలీని ఆపివేస్తామని అక్కడి నుంచి 3 వాహనాలు అభ్యర్థితో కలిపి ఐదుగురికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థులు వారు చెల్లించిన డిపాజిట్ మొత్తానికి ఇచ్చే రశీదు, స్క్రూటినీకి హాజరయ్యేందుకు నోటీసు, ఎన్నికల వ్యయాలు నమోదుచేసే రిజిష్టరు, కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించేందుకు ప్రజాప్రాతినిధ్య చట్టం కింద సూచనలు, ప్రతిజ్ఞ చేసినట్లు ధ్రువీకరణ, నామినేషన్ పత్రంలోని లోపాలు, జతపరచవలసిన పత్రాల సూచికలను రిటర్నింగ్ అధికారి నుంచి పొందాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే నామినేషన్లు తీసుకుంటామని, ఆపైన స్వీకరించమన్నారు. ప్రశాంత వాతావరణంలో స్వార్వత్రిక ఎన్నికలు జరిగేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. పోలింగ్ ఏజెంట్ల నియామకంలో ఎన్నికల సంఘం నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అఖిల పక్ష నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

వెదురుకుప్పం: అతిసార వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు అన్నారు. మండలంలోని బాలుపల్లెలో గ్రామంలో అతిసారం ప్రబలి 21 మంది ఆస్పత్రి పాలవడంతో మంగళవారం డాక్టర్ రవిరాజు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీధులు, శుభ్రతపై ఆరాతీశారు. కలుషిత ఆహారం తినడం ద్వారా వాంతులు, విరేచనాలు అయినట్లు చెప్పారు. ప్రస్తుతం వ్యాధి నియంత్రణలో ఉందని ఎవరికీ ప్రాణాపాయం లేదని స్పష్టం చేశారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అతిసార బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. వ్యాధి అదుపులో ఉందన్నారు. అంతకుముందు పచ్చికాపల్లం పీహెచ్‌సీని తనిఖీ చేశారు.

టీడీపీ మాటలు నమ్మి మోసపోవద్దు


ఎలకాటూరులో ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ పరిశీలకులు మధుసూదన్‌రెడ్డి

- నగరి నియోజకవర్గ పరిశీలకుడు మధుసూదన్ రెడ్డి

నింద్ర: సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు చెబుతున్న అబద్ధపు హామీలను నమ్మి ప్రజలు మోసపోవద్దని రాష్ట్ర ఉపాధిహామీ పథకం కౌన్సిల్ సభ్యుడు, నగరి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎలకాటూరు పంచాయతీ మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం జగనన్న మహిళల పేరిట వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి, మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అలాంటి పథకాలు అమలు జరగాలంటే తిరిగి మనం జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని తెలిపారు. టీడీపీ మాటలు నమ్మిమోసపోద్దని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నగరిలో రోజమ్మను గెలిపించాలని, ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, వైస్ ఎంపీపీ శుభ, మండల కన్వీనర్ వేణురాజు, ఎంపీటీసీ సభ్యులు విజేష్, కోఆప్షన్ సభ్యులు అనిల్ మండల సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణ రెడ్డి, సర్పంచ్ చంద్రబాబు, నమాదేవారెడ్డి, దినకరన్, జలంధర్ రాజు, రవిరెడ్డి, బసవయ్య, శేఖర్, మహేష్, వీరయ్యనాయుడు, రామచంద్రరెడ్డి, సత్యరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.